నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

8 | నిజామాబాద్, శుక్రవారం 4 అక్టోబర్ 2024 | NIZAMABAD


## కొలువుదీరిన దుర్గమ్మ

భక్తుల పూజలందుకొన జగజ్జనని దుర్గమ్మ విచ్చేసింది. అందంగా ముస్తాబు చేసిన మండపాల్లో కొలువు దీరింది. దసరా వేడుకల్లో భాగంగా అమ్మవారు తొలిరోజు గురువారం 'శైలపుత్రి'గా దర్శనమిచ్చింది. ఉమ్మడి జిల్లాలోని ఊరూరా అమ్మవారిని ప్రతిష్ఠించారు. దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు కనకదుర్గమ్మను రోజుకో అవతారంలో భక్తులు కొలుస్తుంటారు.

– ఏర్గట్ల, అక్టోబర్ 3



ఏర్గట్ల మండలకేంద్రంలో పెద్దమ్మ అలయం వద్ద ఏర్పాటు చేసిన మండపానికి అమ్మవారి విగ్రహాన్ని తీసుకెళ్తున్న మాలధారులు



## అటుకుల బతుకమ్మ

తీరొక్క పూలను తెచ్చి, బతుకమ్మగా తీర్చిదిద్ది, పసుపుముద్దతో తయారు చేసిన గౌరమ్మను పెట్టి భక్తితో కొలిచే వేడుక బతుకమ్మ పండుగ. తొమ్మిది రోజుల పాటు మహిళలు నిండు మనస్సుతో ప్రకృతిని కొలిచే వేడుక బతుకమ్మ. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మను ఆరాధించిన అతివలు.. రెండో రోజైన గురువారం అటుకుల బతుకమ్మను భక్తితో కొలిచారు. ఉమ్మడి జిల్లాలోని ఊరూవాడ మహిళల సందడితో మార్మోగింది. బతుకమ్మ పాటలకు అనుగుణంగా లయబద్ధంగా వేసిన స్టెప్పులతో పుడమి పులకించింది.

– బోధన్, అక్టోబర్ 3

## బాల్‌కొండంత అసమ్మతి

- పదవుల పంపకంలో నియోజకవర్గానికి ప్రాధాన్యం
- మూడు కార్పొరేషన్లు, ఒక డీసీసీబీ పోస్ట్
- మిగతా నియోజకవర్గాలకు దక్కని పదవులు
- లోలోపల రగిలి పోతున్న సీనియర్లు
- హస్తం పార్టీలో అసంతృప్తి సెగలు



ఒకే ఒరలో నాలుగు కత్తులు దూర్చిన కాంగ్రెస్

నిజామాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) కాంగ్రెస్‌లో అసమ్మతి రాగాలు ఊపందుకుంటు న్నాయి. పదవుల పందేరంలో బాల్కొండ నియోజక వర్గానికే ప్రాధాన్యమివ్వడంపై అధికార పార్టీలో నిర సన స్వరాలు వినిపిస్తున్నాయి. ఒకే ఒరలో నాలుగు కత్తులను దూర్చిన అధిష్టా నంపై అసంతృప్త జ్వాలలు చెలరేగుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం 37 కార్పొరే షన్ల చైర్మన్లను నియమించగా, అందులో ఉమ్మడి జిల్లాకు నాలుగు పదవులు వరించాయి. ఈ నాలు గింట్లో ఒక్కటి మాత్రమే బాన్సువాడకు, మిగతా మూడు ఒక్క బాల్కొండ నియోజకవర్గానికే చెందిన నాయకులకే దక్కాయి. డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న మానాల మోహన్‌రెడ్డికి సహకార యూనియన్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డికి సీడ్ కార్పొరే షన్, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌కు మైనింగ్ కార్పొరేషన్ పదవులు కట్టబెట్టారు. కాసుల బాలరా జును ఆగ్రోస్ చైర్మన్‌గా నియమించారు. సామాజిక సమీకరణలను పరిగణనలోకి తీసుకోకపోవడం, అధి కారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా సీనియర్లకు ఇంత వరకూ పదవులను కట్టబెట్టకపోవడంతో అధి కార పార్టీలో అసంతృప్తి రాగాలు పెరుగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం మార్కెట్ కమిటీలను భర్తీ చేసి 'చే తులు' దులుపుకోగా, కీలక నేతలంతా తమ వంతు కోసం ఆశగా ఎదురుచూస్తు న్నారు. కానీ వారికి నిరాశే మిగిలింది.

### బాల్కొండకే ఎందుకు..?

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బాల్కొండ నియోజకవర్గానికి పెద్దపీట వేశారు. ఈ ప్రాంతానికి చెందిన ముగ్గురికి పదవులు లభించాయి. అయితే వీరంతా కలిసి మెలిసి పని చేస్తారా.. లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. వీరికి అదనంగా డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి తోడవ్వడం చర్చనీయాంశమైంది. వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన వ్యక్తికి చైర్మన్ పదవి కట్టబెట్టడం ద్వారా కాంగ్రెస్ ఆసక్తికర రాజకీయాలకు తెర లేపింది. మరోవైపు, నియోజవకర్గ ఇన్‌చార్జిగా సునీల్‌రెడ్డి కూడా పార్టీలో పట్టు పెంచుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో గ్రూప్ రాజకీయాలు పెరిగిపోయాయి. ఎవరికి వారే పట్టు కోసం పాకులాడుతుండడంతో శ్రేణుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. మరోవైపు, ఒక్క బాల్కొండ నియోజకవర్గానికే ఏకంగా నాలుగు కీలక పదవులు దక్కడంపై మిగతా ప్రాంతాల నేతలు అసంతృప్తితో ఉన్నారు. సంవత్సరాల నుంచి కష్టపడి పని చేసిన తమను కాదని, ఒకే నియోజకవర్గానికి పెద్దపీట వేయడంపై లోలోన రగిలి పోతున్నారు.

### వర్గపోరు..

కాంగ్రెస్ అంటేనే అంతర్గత కుమ్ములాటలకు పెట్టింది పేరు. బాల్కొండ నియోజకవర్గమే అందుకు నిదర్శనం. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు చాలా మంది ఆసక్తి చూపించారు. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, అన్వేశ్‌రెడ్డి చివరి వరకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కానీ ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత సునీల్‌రెడ్డికి కాంగ్రెస్ అధిష్ఠానం టికెట్ ఇచ్చింది. ఎన్నికలకు కొద్ది నెలల ముందు పార్టీలో చేరిన అతడికి టికెట్ ఇవ్వ డంపై పాత తరం నేతలంతా నొచ్చుకున్నారు. కొత్తగా వచ్చిన వ్యక్తికి అసెంబ్లీ టికెట్ ఇవ్వడమే కాకుండా నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగి స్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏండ్ల నుంచి పార్టీలో ఉంటున్న తమపై కొత్తగా వచ్చిన వారి పెత్తనం ఏమిటన్న ఆవేదనతో రగిలి పోతున్నారు. ఇదే అవకాశంగా మలుచుకుంటున్న నియోజకవర్గా నికి చెందిన కీలక నేతలు తమ బలాన్ని పెంచుకునే పనిలో పడ్డారు.

### బీఆర్‌ఎస్‌ను ఎదురించలేక..

బీఆర్‌ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చాక బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి ఎనలేని ప్రాధాన్యం దక్కింది. ఆర్‌అండ్‌బీ, శాసనసభా వ్యవహారాలు, గృహ నిర్మాణ శాఖలకు మంత్రిగా పని చేసి మంచి గుర్తింపు తెచ్చుకోవడమే కాకుండా ఉమ్మడి జిల్లాపై చెరగని ముద్ర వేశారు. మొన్నటి అసెంబ్లీ ఎన్ని కల్లో అనూహ్య ఫలితాలు రాగా, బాల్కొండలో మాత్రం గులాబీ జెండా రెపరెపలాడింది. ఈ పరిస్థితుల్లో అధికార కాంగ్రెస్‌కు వేముల కొరకరాని కొయ్యగా మారడంతో అధికార పార్టీ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. వేములను ఎదుర్కొనే ధైర్యం లేక బాల్కొండకు కేబినెట్ ర్యాంకుతో కూడిన ముగ్గురికి చైర్మన్ పోస్టులు ఇవ్వడం ఇందులో భాగమేనన్న చర్చ నడుస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదాలను, లోపాలను ఎత్తి చూపడం ద్వారా ప్రశాంత్‌రెడ్డి అధికార పార్టీని ముప్పుతిప్పలు పెడుతు న్నారు. రాష్ట్ర రాజకీయాల్లో, ఉమ్మడి జిల్లాలోనూ కీలకమైన నేతగా ఉన్న వేములను ఢీ కొట్టేందుకే కాంగ్రెస్ స్కెచ్ వేసినట్లుగా చర్చ నడుస్తున్నది. అయితే, మాజీ మంత్రిని టార్గెట్ చేసే క్రమంలో కాంగ్రెస్ అనుసరించిన వైఖరి ఆ పార్టీలోనే అసంతృప్తికి దారి తీసింది. బాల్కొండకే పదవులను కట్టబెట్టి మిగిలిన నియోజకవర్గాల్లోని సీనియర్ నేతలకు మొండి'చేయి' చూపడంతో వారంతా అసంతృప్తితో రగిలి పోతున్నారు. పీసీసీ నాయకత్వాన్ని తూర్పార పడుతున్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు పటిష్ట ఏర్పాట్లు



వీసీలో పాల్గొన్న కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అధికారులు

- కలెక్టర్లతో సీఎం రేవంత్ సమీక్ష
- కామారెడ్డిలో 356 కేంద్రాల ఏర్పాటు
- సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్
- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి/కంఠేశ్వర్, అక్టోబర్ 3 : ధాన్యం కొనుగోళ్లకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ధాన్యం సేకరణ, డీఎస్సీ సర్టిఫికేట్ వెరిఫికేషన్, అపాయింట్‌మెంట్ ఆర్డర్ల ప్రక్రియపై ఆయన గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గతానికి భిన్నంగా ఈసారి సన్నరకం, దొడ్డురకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కౌంటర్లు, కాంటాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. వెంటవెంటనే ధాన్యం తూకం, తరలింపు ప్రక్రియ చేపట్టాలన్నారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికేట్ల వెరిఫికేషన్ పకడ్బందీగా పూర్తి చేయాలని, దసరా కంటే ముందే నియామక ప్రక్రియ చేపట్టాలన్నారు. వీసీ కాన్ఫరెన్స్‌లో కామారెడ్డి, నిజామాబాద్ కలెక్టర్లు ఆశీష్ సాంగ్వాన్, రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్, ఎస్పీ సింధూశర్మ, అడిషనల్ కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, అంకిత్, కిరణ్‌కుమార్, అధికారులు సురేందర్, రాజేందర్, తిరుమల ప్రసాద్, సాయాగౌడ్, అర్వింద్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులతో మాట్లాడుతూ.. జిల్లాలో 356 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం సమీక్ష అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. అవసరమైతే కేంద్రాలను పెంచాలని, సన్న వడ్లను సెపరేట్‌గా కొనుగోలు చేయాలన్నారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద తలెత్తే సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నం. 08468–220051 ఏర్పాటు చేసినట్లు వివరించారు.

## మాఫీ కోసం మహాధర్నా



లింగంపేటలో మహాధర్నాలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

- లింగంపేటలో రోడ్డెక్కిన రైతులు
- అన్నదాతలను ముంచిన రేవంత్ సర్కార్
- పది నెలలైనా హామీలు అమలుకాలే
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే జాజాల ఆగ్రహం



లింగంపేట తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు

లింగంపేట, అక్టోబర్ 3: షరతుల్లేకుండా రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు మహాధర్నాకు దిగారు. లింగంపేట మండలంలో గురువారం ఆందోళన చేపట్టారు. అన్నదాతలకు సంఘీభావంగా మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ కూడా ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్న రేవంత్‌రెడ్డి.. 303 రోజులు దాటినా అమలు చేయలేదని విమర్శించారు. లింగంపేట మండలంలో 3,972 మంది రైతులకు రూ.20 కోట్ల రుణాలు మాఫీ కావాల్సి ఉండగా, 1400 మందికి మాత్రమే మాఫీ చేసి మిగిలిన వారికి ఎగ్గొట్టారన్నారు. ఇంకా సిగ్గు లేకుండా రుణమాఫీ చేసినట్లు ఫ్లెక్సీలు పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్‌కు వలసలు పెరిగాయని, గ్రామాల నుంచి వెళ్లిన ప్రజలు మూసి పరీవాహక ప్రాంతాల్లో ఇండ్లు కట్టుకున్నారన్నారు. ఆ రోజు కండ్లు మూసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు హైడ్రా పేరుతో కూల్చివేతలకు దిగడం ఏమిటని ప్రశ్నించారు. మూసి సుందరీకరణ పేరుతో రూ.1.50 లక్షల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడానికి యత్నిస్తున్నారని విమర్శించారు. ఇందులోంచి కోట్లాది రూపాయలను ఢిల్లీకి పంపేందుకు కుట్ర పన్నారన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి సద్దులు, సంచులు మోయడానికే వెళ్తున్నారు తప్పితే, ఢిల్లీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఓట్ల కోసం వచ్చే నేతలను నిలదీయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన రైతులు తహసీల్దార్ నరేందర్‌గౌడ్‌కు వినతి పత్రం అందించారు. నేతలు సంపత్‌గౌడ్, రమేశ్, కపిల్‌రెడ్డి, సాయిలు, గాండ్ల నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, గన్నునాయక్ పాల్గొన్నారు.



నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ బాక్సర్ నిఖత్‌జరీన్‌కు స్పోర్ట్స్ కోటాలో డీఎస్పీ ఉద్యోగం లభించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా గురువారం డీఎస్పీ యూనిఫామ్ సెరెమనీ నిర్వహించారు. ఆ సందర్భంగా ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

– కంఠేశ్వర్, అక్టోబర్ 3

## ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా పద్మ శ్రీకాంత్

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 3: ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా పద్మ శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత చైర్మన్ కుడుముల సత్యంపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో, ఆయన దిగిపోయిన సంగతి తెలిసిందే. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీవో మన్నె ప్రభాకర్ సమక్షంలో చైర్మన్ ఎన్నికను నిర్వహించారు. మొత్తం 12మంది కౌన్సిలర్లు ఉండగా.. ఎనిమిది మంది శ్రీకాంత్‌కు మద్దతు తెలిపారు. దీంతో ఆయన చైర్మన్‌గా ఎన్నికైనట్లు ప్రకటించారు. నలుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. నూతన చైర్మన్‌ను ఎమ్మెల్యే మదన్‌మోహన్ అభినందించారు.

## ఎలక్ట్రికల్ బస్సులొచ్చేశాయ్

- నేడు ప్రారంభించనున్న మంత్రి

ఖలీల్‌వాడి, అక్టోబర్ 3: ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులు వచ్చేశాయ్. తొలి విడుతలో నిజామాబాద్ రీజియన్‌కు 13 బస్సులు చేరుకున్నాయి. వీటిని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఆర్‌ఎం జానీరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాలుష్య కారక ఉద్గారాలను విడుదల చేయని ఈ ఎలక్ట్రికల్ బస్సుల్లో 41 సీట్ల సామర్థ్యం ఉంటుందన్నారు. వీటిని నిజామాబాద్–జేబీఎస్ మధ్య వీటిని తిప్పనున్నట్లు పేర్కొన్నారు. పెద్దలకు రూ.360, పిల్లలకు రూ.230 చొప్పున టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు.




## పకడ్బందీగా డిజిటల్ కార్డుల సర్వే



డిచ్‌పల్లి మండలం సాంపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

డిచ్‌పల్లి/ ఆర్మూర్, అక్టోబర్ 3:జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన డిజిటల్ కార్డుల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. తప్పుల్లేకుండా కుటుంబ వివరాలను నమోదు చేయాలన్నారు. గురువారం డిచ్‌పల్లి మండలం సాంపల్లిలో, ఆర్మూర్‌లో ప్రారంభించిన డిజిటల్ కార్డుల సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఫ్యామిలీ డేటాబేస్ ఆధారంగా అధికారులు సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా అన్ని వివరాలను సక్రమంగా పొందుపర్చాలన్నారు. ఇంటి నెంబర్, చిరునామా, కుటుంబ యజమాని, కుటుంబ సభ్యులకు యజమానితో గల సంబంధం వంటి వివరాలను పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. నిర్ణీత సమయంలోగా సర్వేను పూర్తి చేయాలని, ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఏ ఒక్క కుటుంబం కూడా తప్పిపోకుండా నూటికి నూరు శాతం డిజిటల్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సర్వేను పకడ్బందీగా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ అంకిత్, డిచ్‌పల్లి ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ ప్రభాకర్, ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య, ఆర్డీవో రాజాగౌడ్, కమిషనర్ రాజు పాల్గొన్నారు.

### పక్కాగా ఇంటింటి సర్వే..

కామారెడ్డి, అక్టోబర్ 3 : ఇంటింటి కుటుంబ సర్వేను పక్కాగా నిర్వహించాలని కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశించారు. గురువారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో చేపట్టిన కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద చేపడుతున్న ఇంటింటి కుటుంబ సర్వేను సమగ్ర వివరాలతో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆర్డీవో రంగనాథ్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, మున్సిపల్ కమిషనర్ సుజాత, టీం సభ్యులు పాల్గొన్నారు.


